# బానిస

## రంధి సోమరాజు

అతను సుఖశ్రీ. అతని భార్య ఉషోనవరేఖ. అతడామెను 'రోజా కుమారి' అని పిలుస్తాడు. అలా అన్నప్పుడల్లా, ఆమె ముసిముసి నవ్వులతో, 'ఊరుకుందురూ...అదేమిటీ...' అంటుంది. ఆమె అలా అన్నప్పుడల్లా అతను పకపక నవ్వుతాడు.

ఆవేళ అతని సైకిలు నడచేస్థితిలో లేదు. అందువల్ల వీధిలోనికి నడచివెళ్లడానికి అతనికి మనసొప్పలేదు. ఆ వాహనంమీద తప్ప అతనికి కాలినడకను బజారులోనికి పోవడమంటే—అతని పరువేదో బజారున పడిపోయినట్టుగానే ఉంది. అందువల్లనే కాబోలు, అతను చాలసేపు ఇంట్లో అటూ ఇటూ తిరిగాడు. ఇంతలో అతని భార్య, 'ఇంకా ఇక్కడే ఉన్నారేమిటి? ఇలా అయితే వేళకు అన్నం అమరినట్లే...ఉ ఉ ...త్వరగా వెళ్లిరండీ...' అంది. అతను మెల్లగా ఆమెతో, 'సైకిలు పాడైంది' అన్నాడు; పాపమామె తను నడచివెళ్ళవలసి వచ్చినందుకు ఎంతో సానుభూతిని చూపవలసిన అవసరమున్నట్టు. అయితే ఆమె అదేమీ ఆలోచించకుండానే, 'అయితే నడవలేరా...పాపం చిట్టి పాపాయిలా మాట్లాడుతున్నారేమిటి!' అంది. అలా ఆమె అన్నందు కాతనికి కోపం రాలేదు. కాని అత నా సైకిలుపై కినుక వహించకుండా ఉండలేకపోయాడు.

'ఏమిటో చేతిలో సంచి ఉంచుకొని నడచి ఇంటికి కూరగాయలు తెస్తూఉంటే, అబ్బ! ఎంతసహ్యంగా ఉంటుంది! ఎంత తలవంపులుగా ఉంటుంది! అసలు తనంతటి వాడు కూరగాయలు తేవడమేమిటీ? ఏమిటో ఆ సాయీబునుమానిపించి వేయడం ఎంత పొరపాటైంది!' అనుకున్నాడు.

ఇంతలో అతని భార్యామణి, క్రొత్త శేషనులో శిల్పి చిత్రించినట్లుగాతీర్చి దిద్దుకున్న వీగముడిని, భూమికి జేనెడెత్తువరకు, అతిఅందమైన ఫక్కీలో జార్చిన చక్కని చీర చెరగును, రవ్వల దుద్దుల్ని, నెక్లెసు హారాన్ని, ప్రక్కవాటుగానిలచి అద్దంలో తిలకిస్తూ, పల్చని గులాబివన్నెల పెదవి, తెల్లని పలువరుస, సువిశాలమైనకనులు, ఒకించుక ముద్దుగా కదపి, 'మా శా రా ......ఇవ్వాళ కూడ దాసీది రాలేదు. ఇలా అయితే నేనీ ఇంట్లో పని చేయలేను బాబూ' అని తమలపాకులవంటి అతి సున్నితమైన చేయిచాచి, పసిడిగాజుల నిగనిగలూ, పొడవైన వ్రేళుల ఎర్రని గోళ్ల తళతళలూ మెరిపించింది. సుఖశ్రీకి ఆమె వ్రేళులను ముద్దుపెట్టుకోవా లనిపించింది. ఒక్కసారి ఆమెను నిలువునా కౌగిలించుకోవాలనిపించింది. అతనికి నందుడు జ్ఞాపకానికి వచ్చాడు. కాని తన భార్య సుందరి వలె తనగురించి బెంగపెట్టుకోవడంలేదు. బజారుకు పోవొద్దని చెప్పడమూ లేదు. అంచాతనే అతనికి తప్పక ఇంటికి తిరిగి రాగలననే ధైర్యం కలిగింది. మరి బజారుకు వెళ్ళక తప్పదనీ అనిపించింది. ఇంతలో ఆ సుందరి, 'నేనడిగినదానికి సమాధానం చెప్పకుండానే వేంచేస్తున్నారేమిటీ...' అంది. ఇంత పరాకు - రోజా కుమారి అడిగితే జవాబు చెప్పకుండా పయనమై వెళ్ళిపోయేటంత పరాకు, ఎట్లా కలిగిందా అని సుఖశ్రీ ఒకసారి తనగుండె లోతుల్ని గాలించాడు. ఇంతలో అతని ప్రియసఖి, 'ఏమిటండీ ..మాట్లాడరేమిటి? దాన్ని మానిపించి ఇంకోదాన్ని పెడతారా లేదా' అంది. సోయగపు మిటారి ఇన్ని పలుకులు పలికినా మారాడని తన బుద్ధిమాంద్యతకు సిగ్గుపడి సుఖశ్రీ పుంగవుడు, 'అలాగే, అలాగే...దాన్ని మానిపించేదాం' అన్నాడు. అంటూ బజారుకు విచారంగా అడుగులు వేసుకుంటూ, దించిన తల ఎత్తకుండా, చేతిలోసంచి ఇతరులకు కనిపించకుండా, బహు నేర్పుగా చిన్న మడతపెట్టి దాన్ని చేతి రుమాలుగా హస్తాన నొక్కి ఉంచి, దీర్ఘంగా ఏమిటో ఆలోచిస్తూ దారితీస్తున్నాడు. ఇహ ఆ చెలి, ప్రియుని గుమ్మమువరకూ సాగనంపి, 'వేగమే వచ్చేయండే' అని కోయిలవలె ఒక మధుర ధ్వని వినిపించి, అతను వెనుదిరిగి చూసే వరకు ఒయ్యారంగా అక్కడే నిలచి, మోహనంగా లోనికి వెడలిపోయింది. దానితో సుఖశ్రీ మనసు కొంత సుఖానపడింది. రోజాకుమారి తను వెనుతిరిగి చూసేసరికి, చిరునగవు మొగాన సగం సగంగా సిగ్గు తొణికిస్తూ తనను మురిపెంగా గుమ్మం వద్ద నిలచి వీక్షిస్తూఉండడం, అతని కెంతో ఉత్సాహాన్ని కూర్చింది. ఇహ అతను ఆ ఉత్సాహాన్ని ఆసరాగా తీసుకొని ఎంత పనైనా చేసెయ్యగలడు. అయితే అట్లా అత కెంతమట్టుకు ఆచరిస్తాడూ అనేది ఆలోచించవలసిన విషయమే!

అసలు సుఖశ్రీ బహు సుకుమారి. ఆమెయో మరి లవలీ కిసాలయము. ఈ ద్వయము ఒక అందమైన రోజాపూల జంట. మరి వారి పలుకు, సుమనోహర పుష్ప సువాసనా సమ్మిశ్రిత సమీరము. దారి నడక, చల్లని నీలిమబ్బు వెల్లువల మెల్లని కదలికల నిండు ఒయ్యారము. వారి ఎదలు, నీలికడలి హృదయాన నిండు జాబిల్లి నర్తించిన రేయి, పులకించిన బంగరుకాంతుల విచ్చుకొనే పూలవంటి సోయగము!

సుఖశ్రీ వీధివెంబడి తలవాల్చి ఏమిటో ఊహిస్తూ మెల్లగా నడుస్తున్నాడు. రోజా కుమారి అతని కళ్ళముందు అవతరించింది. వెంటనే, 'రోజా కుమారి ఎంత సుకుమారి' అనుకున్నాడు సుఖశ్రీ. 'ఆమె ఏడు మల్లెపూల ఎత్తు ఉండునో, ఉండదో...నిజముగా నేటి నవనాగరికతా చిహ్నమునకామె మచ్చుతునక! సరియైన వేషరచనా శిల్పమున కామెది అందెవేసిన చేయి! తనది ఎంత అదృష్టము! ఆమె చేయి కదపినా, కాలు కదపినా అందాలరాసులు, రాసులు పోసినట్లుంటుంది. ఆమె ఎంత అందమైనది. ఆమె, నిజంగా చందనపు బొమ్మ! ఇట్లా సుఖశ్రీ ఊహాల అంతరిక్షాన ఊగేగుతూ వుండగా, 'నమస్కారమండీ...సుఖశ్రీగారు' అంటూ ఒకాయన సుఖశ్రీని పలకరించాడు: సుఖశ్రీ ఒకింత పరధ్యానముగా తల ఎత్తి 'ఒహోహో...మీరా...నమస్కారమండీ...' అని ఇంకా ఏమిటో చెప్పడానికి నోరు విప్పబోతూవుంటే, ఆ పెద్దమనిషి, 'అరే...నడచి వెళ్తున్నారేం...సైకిలేమయ్యింది' అని సుఖశ్రీ పడుతూన్న కష్టమున కాతనెంతో సానుభూతిని ప్రకటించాడు. పాపము సుఖశ్రీ తన మిత్రుని మాటకు, రెండు ముక్కలుగా తన తల తెగిపోయినట్లయి,పాతాళమునకు కృంగి కృంగి, కంఠమువరకూవచ్చిన దుఃఖమును దిగమ్రింగి సైకిలుకువచ్చిన రోగమును, సవివరముగా ఆయనకు వివరించి, తనమార్గమున తాను తిరిగి పయనము సాగించాడు.

అప్పటికి బారెడు ప్రొద్దెక్కింది. తరులెక్కుతూవున్న తరణికాంతుల్ని, తరిగిపోతూవున్న నీలినీడల పొడవుల్ని సుఖశ్రీ, చూసేస్థితిలో లేడు. అతనిగుండె అర్థంకాని సామర్థ్యాతో తెగ ఇదైపోతూంది. అతని మనస్సు అవమానంతోదహించుకపోతూంది. ఇహ నడచి వీధిలోనికి అందులో కూరగాయలు తేవడానికి ఎప్పుడూ రాకూడదనే భావం అతనిలో చొచ్చుకొని, కాంక్రీటు గోడలోనికి బలంగా దిగిన మేకువలె ఊడి రావడం లేదు. ఎవరి జీవితపుస్థాయిని వారు చెప్పకుండా కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంలో సుఖశ్రీకి

గట్టిగా తట్టింది. ఇట్లాంటి గోడలు ఉండ గూడదనేభావం, అత్యంత శోచనీయమైన దిగా అతనికి వెనువెంటనే తోచింది. తను నిజంగా ఒక ఉచ్చస్థితిని అందుకున్నవాడు. ఆస్థితికి తగ్గగౌరవాన్ని, తను సంపాదించ గలుగుతూన్నప్పుడు, ఆ గౌరవాల పొలి మేరలచుట్టూ కంచెకట్టకపోతే, ఆ గౌరవ ముతోబాటు ఆస్థితిగూడ అధోగతికి దిగజారి పోక ఏమాతుంది? తప్పకుండా ఈ విష యంలో తను జాగ్రత్తపడవలసిన అవసరం ఎంతైనా ఉంది. రేపే ఎంతజీతానికైనా ఒక కుర్రవాణ్ణి ఇంటిపనుల నిమిత్తం నియ మించాలి. ఇందులో ఇహ ఆలస్యం ఏమాత్రం చెయ్యగూడదు అని ఓ నిర్ణయాని కొచ్చాడు సుఖశ్రీ.

'అసలు తన స్థితికి తాను ఒక చక్కని కారును పోషించగల తాహతు ఉన్నవాడే. కాని, కారు కొనడానికి మనసెందుకనో జంకుతూంది. ఏమైనా రోజా కువారికి పనిమనిషినే కాకుండా వంటమనిషిని కూడా వెంటనే సహాయంగా ఇవ్వకపోతే ఆమెకు తాను చాల ఇక్కట్లు కలిగించిన వాడౌతాడు. ఆమె కీయవలసిన స్థానాన్ని ఆమెకీయకుండా, ఆమెను పనిమనిషిగా ఉంచడం చాల నీచంగా లేదూ? ఎంత తప్పుపని జరిగింది! ఇన్నాళ్లవరకూ ఇట్లాంటి ఆలోచనే తట్ట లేదెందుచేతనో! అరామా రావూ కుటుంబం తనను చూసి నవ్వుతున్నా రంటే... నవ్వరూమరి! ... ఇలాంటివిష యాలలో తను పిసినిగొట్టుగా వ్యవహరిస్తు న్నట్లు ఇతరులుభావిస్తే అది వారి తప్పెట్లా ఔతుంది? ఇహ ఏవిధంగా చూసినా చిల్లరి చిల్లరి స్నేహాల్నా కటి కట్టిపెట్టడమే మంచిది. ఒకవిధంగా తను ఇకముందునుంచి రిజర్వ్‌డ్‌గా ఉండడం ఎంతైనా అవసరం. మాటలో నడకలో, క్రియలో — ఒక హుందా తనం ఉట్టి పడేట్టు సంచరిస్తూ ఉంటేగాని ఇహఏమీ లాభంలేదు. ఈ లోకానికి లోకువై పోవడానికి కారణం నిజంగా ఇట్లాంటి బహు చిన్నవిషయాలను ఖాతరు చెయ్యకపోవడం వల్లనే అని చెప్పాలి.'

సుఖశ్రీ ఈ ఆలోచనలతో సాగిస్తూన్న నడక, అకస్మాత్తుగా ఎందుకనో మందగించి పోయినట్లయి అందుకు కారణం ఏమిటా అన్నట్లు పరిశీలనగా అతను అటూ ఇటూ చూశాడు. కాని దానికి తగిన కారణ మేమీ అతనికి కనిపించలేదు. కాని అతని ముందు ఒక స్త్రీ ఒకగంప నెత్తు కొని ముందుకు సాగిపోతూంది. అయితే అతని నడక మందగించి పోవడానికి మాత్రం ఆమె కారణంకాదు. కాని ఒకసారి ఆమెను చూసినతరువాత, ఆమెను మరొక సారి చూడాలని అతని మనసు ఉవ్విళ్ళూ రింది. అతని దృష్టి మరొకసారి అటు ప్రస రించింది.

ఆమె ఎంతో బరువును మోస్తూంది. ఆ పెద్ద గంపనిండా నాలుగయిదు మణుగుల వంకాయలుంటాయి. గంప పూర్తిగా నిండి పోగా, గంపచుట్టూ పొడుగుపాటి వంకా యలు గ్రుచ్చి, ఆ కలసివచ్చిన ఎత్తు మేరకు ఆ కాయలను పూర్తిగానింపి, ఆమె భార ముగా అడుగులు వేస్తూ నడుస్తూంది.

ఆమె ఏమాత్రం అజాగ్రత్తగా గంపను కదపినా, ఆ కాయలు భూమిని చేరు కుంటాయి. ఆమె ఎంతదూరంనుంచి అంత బరువు గంపను నెత్తిమీదఉంచి, మెడను కాస్తకూడ కదలనివ్వకుండా, ప్రాణాలు బిగ బెట్టి, మొగాన జారే నీటి బొట్టులను వ్రేళ్లతో చిందుకుంటూ, ఎల్లా నడచి ఇంత దూరం రాగలిగిందో సుఖశ్రీకి అంతుపట్ట లేదు. కాని ఆమెపై అతని కేదో అభిమానం కలిగింది. ఆమెను పదేపదే చూడాలని అతని గుండె తహతహలాడిపోయింది.

పాప మామె నల్లగాఉంది. ఆమె మెడ దాని స్థానములో పొంకముగా అమరిఉంది. ఆమెకు సొమ్ములు లేవు. ఆమె సింగారించిన చీరలో సొగసులు లేవు. ఆమె సిగ ముడిలో అద్భుత శిల్ప రచనా నైపుణ్యములేదు. అయినా సుఖశ్రీకి ఆమెవైపు చూడాలనే కాంక్ష హెచ్చయింది. ఆమె వెనుకనే నడవాలనే కోరిక అధికమైంది.

ఆమె సుకుమారికాదు. ఇంటివద్ద కూర్చు న్నచో ఆమెకు గడచేస్థితి లేదు. వీధి వెంబడి ఈ గంపను నెత్తిపై ఉంచుకొని నడవటాని కామె కెట్టి ప్రతిబంధకమూ లేదు. ఆమె కచ్చాపోసి నడుస్తూంది. ఆమె పిక్కలూ, తొడలూ యౌవ్వన ప్రాదుర్భా వముతో మిసమిసలాడి పోతున్నాయి. ఆ కఠిన స్తనోన్నత రేఖాస్ఫూర్తి పెల్లుబికి, జాలిగా స్వేదజలాన తడిసిన రవికను కౌగి లించుకుంటూంది.

ఆమె కొక ప్రక్కగా నడుస్తూన్న సుఖశ్రీ ఆమె యీ కష్టమునకు మనసులో చాల కష్టపడి, వివిధ విధాలైన ఆలోచన లలో మునిగిపోయాడు. ఆమె అంత బరు వుతో కూడ నడకలో ఎంతో వేగమును సాధిస్తూంది. సుఖశ్రీ కొంచెము వెనుకపడి పోయాడు. కాని ఆమెనుండి అతని ఊహలు కదలిరాలేదు. సుఖశ్రీ మనసులో జాలి నిండింది. అది మానవునిగా తలఎత్తి ఆమె పడుతూన్న కష్టమును పూర్తిగా ఆకళింపు చేసుకుంది.

అదే సమయాన ఎట్లా జారిపడ్డదో నిలు వుగా గ్రుచ్చిన ఒక వంకాయ క్రిందపడింది. దానితో మరి నాలుగయిదు కాయలు క్రింద వూడిపడ్డాయి. అవి పడిన ధ్వనికి ఆమె నిలచిపోయి, మెల్లగా వెనక్కి తిరిగి, అక్కడే ఎదురుగా కనిపించిన సుఖశ్రీని ఉద్దేశించి,

'బాబ్బాబు. కూతంత ఆటినిటివ్వండి' అంది. ఆమె మొగంలో క్లేశము ముడివడి ఉంది. బాధాసూచిత సజల నేత్రాలలో దైన్యము తడబడింది. 'అయ్యో... ఊరికా పనిచెప్పావు ... ఎంత తప్పు చేశావే ... అయ్యో...' అని ఆమెగుండెల్లో ఏదో పశ్చాత్తాపపు గుండము సుడివడింది. ఆమె పూర్తిగా భయముతో వణకిపోయింది.

సుఖశ్రీ ఒక్కసారిగా నిశ్చేష్టుడై పోయాడు. వెనువెంటనే అతని ఎదలో ఎందఱో క్రూరరాక్షసు లుద్భవించారు. వారు, 'ఓయి సుఖశ్రీ! నీకీనాడు సైకిలు లేకపోవడంవల్ల ఎన్ని ఇక్కట్లు సంభ వించాయి! నీ పరువు మంట గలపటానికే అది అట్లా మూలను పడింది. పోనీ నీవు సైకిలు రిక్షామీదైన బజారుకు బయలుదేరిఉంటే ఎంత బాగుండి ఉండేది. ఇంతటితోనైన ఒక కుర్రవాణ్ణి వెంటనే ఇంటిపనులనిమిత్తం నియమించవయ్యా. అబ్బ! ఇది ఇతరుల కంటబడితే ఎంత నగుబాటుగా ఉంటుంది! ఇక్కడ ఒక్కక్షణముకూడ ఉండక తక్ష ణమే పయనము సాగించవయ్యా! అసలిది నిన్నిట్లా తెగించి అడిగినందుకు చెప్పాలి... అబ్బ! రోజులెట్లా ముందుక పోతున్నాయి' అన్నారు. పాపం సుఖశ్రీకి ఎటూ తోచ లేదు. కాని అతనిపాదములుమాత్రం అతనికి తెలియకుండానే బరువుగా ప్రక్కకు తిరిగి పోయాయి.

అట్లా అవి ప్రక్కకు తిరిగినవెంటనే అతనిలో ఎందఱో దేవతలు తలఎత్తారు. వారు అతనికి ఆమె అతికష్టంమీద, ఒంటికాలిమీద నిలచి, రెండవకాలి వ్రేళ్ళతో వాటిని ఒక్కటొక్కటిగా అందుకుంటూ, ఆ కాలు చేతి కందేవరకు వెనుకగా మడచి, ప్రేగులు తెగిపోయే పర్యంతమూ అయి, ఎలాగో వాటిని ఆ గంప లోనికి చేరవేస్తూండటను చూపారు. సుఖశ్రీ ఆ దృశ్యాన్ని చూడలేకపోయాడు. అతని గుండె వెక్కి వెక్కి ఏడ్చింది. 'అయ్యో! సుఖశ్రీ......నీ కిట్టి దుష్టభావము లెట్లా కలిగిన వయ్యా! కలిగినా నీవు వాటికి బానిస వెట్లా అయిపోయావయ్యా!' అని ఆ ఎద ఎంతగానో కుమిలి కుమిలి ఏడ్చింది.

పాపం సుఖశ్రీ 'నేను బానిసను... నేను బానిసను' అని గట్టిగా విలపించబోయాడు కాని అందుకుకూడ అత డస్వతంత్రుడై అయి, రెండు కన్నీటి చుక్కలు మాత్రం తన బానిసత్వానికి చిహ్నంగా మెల్లగ రాల్చాడు.

[ఆలిండియా రేడియో ప్రసారితం